నేటి దినపత్రిక
# సూర్య
## కర్నూలు | నంద్యాల
గురువారం | 04 జనవరి 2024 పేజీలు 8



ప్రముఖులకు చేరిన

# అయోధ్య అక్షింతలు

**కర్నూలుకల్చరల్, మేజర్‌న్యూస్ :**
అయోధ్యలో పూజలు అందుకున్న అక్షింతల పంపిణీ కర్నూలు జిల్లాలో మూడవ రోజుకు చేరింది. బుధవారం నగరంలోని పలువురు ప్రముఖులను కలిసిన వీహెచ్‌పీ నేతలు వారికి అక్షంతలను అందించారు. కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్,

### అందించిన వీహెచ్‌పీ నేతలు

మాజీ ఎమ్మెల్యే ఎస్ వి మోహన్ రెడ్డి మరియు కర్నూలు జిల్లా KDCC బ్యాంక్ అధ్యక్షురాలు ఎస్ వి విజయ మనోహరి,టీడీపీ కర్నూల్ అసెంబ్లీ కన్వీనర్ TG భరత్, DVR హెూటల్ అధినేత D.వెంకటేశ్వరరెడ్డిలకు అయోధ్య శ్రీరాముని మిగతా 2లో



- కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు
- భారీగా మోహరించిన పోలీసులు
- దాదాపు ఐదు గంటలపాటు నిరసన
- కలెక్టరేట్ గేట్లకు తాళాలు వేసిన పోలీసులు
- ఇబ్బందులు పడిన ఉద్యోగులు



మాట్లాడుతున్న ఎం.ఎ.గఫూర్

## నిర్బంధాలు చేసినా
# పోరాటం ఆగదు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:**
తమను నిర్బంధించిన పోరాటం ఆగదని అంగన్‌వాడీలు తెగేసి చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం గత 23రోజులుగా ధర్నాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఎంఎ.గఫూర్, రాధాక్రిష్ణలు మాట్లాడుతూ గత ఎన్నికల కంటే ముందు అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ వేతనాలు ఇస్తామని, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తామని మాట ఇచ్చిన జగన్ అధికారంలోకి నాలుగున్నరేళ్లు కావస్తున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా అంగన్‌వాడీలు పట్టువదలని దీక్షతో సమ్మె కొనసాగిస్తున్నారన్నారు. అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, జిల్లా గౌరవ అధ్యక్షురాలు నిర్మలమ్మ, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు మునెప్ప, అంజిబాబులు మాట్లాడుతూ

మిగతా 2లో



కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు



### ఆలూరు టికెట్ కోసం వైసీపీలో పోటాపోటీ

మంత్రి గుమ్మనూరు నియోజకవర్గంపైనే అందరి దృష్టి

## ఆశావహుల్లో అగ్రస్థానంలో
# సురేందర్‌రెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :**
రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రాతినిధ్యం వహిస్తోన్న ఆలూరు నియోజకవర్గం వైఎస్సార్సీపి టికెట్ కోసం ఆశావహులు బారులు తీరారు. ఈ మారు గుమ్మనూరును కర్నూలు పార్లమెంట్ స్థానం నుండి అధిష్ఠానం పోటీలోకి దింపబోతోందన్న బలమైన సంకేతాలు అందుతున్న నేపథ్యంలో ఈ నియోజకవర్గం నుండి ఎవరిని టికెట్ వరిస్తుందన్న దానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న సిట్టింగ్‌లకు టికెట్లు ఇవ్వకూడదని అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం గుమ్మనూరు జయరాంకు వర్తిస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. వివిధ రకాల ప్రచారాల నేపథ్యంలో ఆలూరు నుండి మిగతా 2లో

### టిడిపి జాబితా
# ఫిబ్రవరిలోనే..!



- కుటుంబానికి ఒక టికెట్‌పై పునరాలోచన
- చేరికల అనంతరం పూర్తిస్థాయి జాబితా
- ఆశావాహుల్లో పెరుగుతున్న ఆతృత

**కర్నూలు, సూర్య ప్రతినిధి:**
తెలుగుదేశం పార్టీ తరపున సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాపై పార్టీ అధినాయకత్వం స్పష్టత ఇచ్చినట్లు పార్టీ నేతలు వెల్లడిస్తున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ నెల 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అన్ని 26 బహిరంగ సభల్లో పాల్గొనవలసి ఉంది. ఇదే సమయంలో ఆయా లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ నేతలతో సమీక్షిస్తారని పార్టీ నేతలతో సమీక్షిస్తారని వారంటున్నారు. అంతేగాక పార్టీలో చేరికల కారణంగా ఆయా నియోజక వర్గాల్లో విజయావకాశాలు ఏ మేరకు పెరుగుతాయన్న మిగతా 2లో



కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

### పేదలకు అండగా
# రాష్ట్ర ప్రభుత్వం

**కొత్తగా 3,374 పెన్షన్లు మంజూరు**
**కర్నూలు జిల్లా కలెక్టర్ జి.సృజన**

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:**
పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా 2,48,072మంది పెన్షన్ పెంపు ప్రయోజనం కలిగిందని జిల్లా కలెక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల మైదనాంలో వైఎస్సార్ పెన్షన్ పెంపు మహోత్సవాల్లో పెన్షన్ నగదు మొత్తం రూ.2,750ల నుంచి రూ.3వేల పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిచారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పెన్షన్ పంపిణీ మిగతా 2లో

### ఖద్దరు వైపు అడుగులు వేస్తున్న
# ఖాఖీ టోపి



- గతంలో ఆలూరులో విధులు నిర్వహించిన పోలీసు అధికారి
- ప్రధాన పార్టీలు బిసిల వైపు చూస్తే నేను ఉన్నాను అంటున్న ఖాఖీ...
- తన సామాజికవర్గంతో పాటు ఇతర వర్గాల నాయకులతో సత్సంబంధాలు
- ఈశ్వరుడి దయతో టికెట్ కేటాయిస్తే గెలుపునాదే అంటున్న ఖాఖీ

**ఆలూరు,మేజర్ న్యూస్ః**
ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది కర్నూలు జిల్లాలో పోటీ చేసే ఆశావాహులు సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. జిల్లాలోని మిగతా 2లో

# ఆశావహుల్లో అగ్రస్థానంలో సురేందర్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

అనేక మంది ఆశావహులున్నా అందులో ఆగ్రస్థానంలో తెర్నేకల్ సురేందర్‌రెడ్డి ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఆలూరు నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరించిన సురేందర్‌రెడ్డి ఆ తర్వాత కూడా వైఎస్ కుటుంబంతో అనుబంధం కొనసాగిస్తూ వస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో సొంత నియోజకవర్గం ఆలూరుతో పాటు కర్నూలులోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రంలో వైఎస్సార్సీపి అధికారంలోకి వచ్చాక తనకు ఎలాంటి పదవులు దక్కకపోయినా అధిష్టానానికి నమ్మిన బంటులా వ్యవహరిస్తూ వస్తోన్న తెర్నేకల్ సురేందర్‌రెడ్డి పేరును పార్టీ కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆలూరు నియోజకవర్గంలో గడచిన ఐదేళ్లుగా మంత్రి గుమ్మనూరుతో పాటు ప్రతి గ్రామంలో పర్యటిస్తూ వస్తున్న సురేందర్‌రెడ్డి 2024 ఎన్నికల్లో పార్టీ టికెట్ ఆశిస్తున్నారు ఆయన కుటుంబానికి పుచ్చలపల్లి సుందరయ్యతో మంచి అనుబంధం ఉంది. సుందరయ్య అడుగుజాడల్లో నడిచిన ఆయన కుటుంబం భూస్వామ్య వ్యవస్థ మీద తిరుగుబాటు చేసింది. ఆ తర్వాత దివంగత వైఎస్సార్ విధానాలకు ఆకర్శితుడైన తెర్నేకల్ సురేందర్‌రెడ్డి 2009 నుండి ఆలూరు నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణంతో జగన్మోహన్‌రెడ్డితో కలిసి అడుగులు వేయడం ప్రారంభించారు. 2011లో ఆలూరు ఎమ్మెల్యే



నీరజారెడ్డిని వ్యతిరేకించి జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన ఓదార్పు యాత్రకు ఆలూరు నియోజకవర్గంలో అన్నీ తానే అయి నిర్వహించి తన సత్తా చూపించారు. వైఎస్ విజయమ్మ బస్ యాత్రకు, షర్మిల పాదయాత్రకు అన్ని రకాలుగా సహాయసహకారాలు అందించిన సురేందర్‌రెడ్డి పార్టీ అభివృద్ధి కోసం అంకితమై పని చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో వైకాపా ప్రతిపక్ష స్థానంలో ఉన్నా అధికార పక్షం నుండి వచ్చిన ఒత్తిళ్లను ఎదుర్కొని నిలిచిన సురేందర్‌రెడ్డి స్వగ్రామంలో సర్పంచ్, ఎంపిటిసిలను గెలిపించుకున్నారు. ప్రస్తుతం కర్నూలు ఎంపితో పాటు ఆలూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యేలందరితో సఖ్యతగా ఉంటున్న సురేందర్‌రెడ్డిని అధిష్టానం ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశీర్వదిస్తుందా? అన్నది అందరిలోనూ ఉత్కంఠను రేపుతోంది. ప్రస్తుతం జెసిఎస్ఐ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తోన్న తెర్నేకల్ సురేందర్‌రెడ్డి జిల్లా అంతటా కలియ తిరుగుతూ ఆలూరుపై ప్రత్యేక దృష్టితో పని చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వాలంటూ ఇప్పటికే నియోజకవర్గంలోని ఆయన అభిమానులు కోరడమే కాకుండా అధిష్టానానికి కూడా అనేక మార్లు లేఖలు రాశారు. మరి అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. సురేందర్‌రెడ్డి అనుచరులు మాత్రం ఈ ఎన్నికల్లో అధిష్టానం ఆశీస్సులు తమ నాయకునికే ఉంటాయన్న ఆశల్లో ఉన్నారు.



కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు

# నిర్బంధాలు చేసినా పోరాటం ఆగదు

(మొదటిపేజీ తరువాయి)



నిరసన కార్యక్రమం వద్దే భోజనం చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడిలు చేస్తున్న సమ్మెను నీరుగార్చడానికి వారి సెంటర్లను బలవంతంగా తెరవడానికి ప్రయత్నించడం సబబు కాదన్నారు. ఈ చర్యలను అంగన్‌వాడివర్కర్లు ధైర్యంగా అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, ఆయా సంఘాల నాయకులు రేణుకమ్మ, వరలక్ష్మి, గోవర్ధనమ్మ, కాంతమ్మ, విజయం భారతి, పద్మ, జ్యోతి, ప్రభాకర్, సాయిబాబా, నరసింహులు, అబ్దుల్లా, వెంకటేషులు, శ్రీనివాసులు, గోపాల్, సుధాకప్ప, రాముడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

**భారీగా మోహరించిన పోలీసులు:** అంగన్‌వాడీలు కలెక్టరేట్ కార్యాలయానికి ముట్టడిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు కలెక్టరేట్ వద్ద భారీగా మోహరించారు. కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చే అన్ని గేట్లను తాళాలతో మూసివేశారు. దీంతో కార్యాలయం లోపలికి వెళ్లడానికి కలెక్టరేట్ ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడ్డారు. దాదాపు 5గంటల పాటు అంగన్‌వాడీలు నిరసన తెలపడంతో కలెక్టరేట్‌కు తమ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్ జి.సృజన, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్, డీసీఎంఎస్ చైర్మన్ సి.హెచ్.శిరోమణిమద్దయ్య, డీఆర్‌డీఏ పీడీ సలీంబాష, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా జిల్లాకు 3,374 పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎ వైఎస్ జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేయడం జరుగు తుందన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పెన్షన్ లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు.

# టిడిపి జాబితా ఫిబ్రవరిలోనే..!

(మొదటిపేజీ తరువాయి)

అంశంపై కూడా పార్టీ నాయకులు చర్చించి అభ్యర్థుల జాబితా ఒకే సారి ఫిబ్రవరిలో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు వారు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్న వారు, వైసిపిలో టికెట్ రాని వారితో అనేక మంది తటస్థులు పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్న కారణంగా పార్టీ జాబితా ఆలస్యమవుతోందని వారు భావిస్తున్నారు. అయితే కొత్తగా పార్టీలో చేరే వారెవరికీ టికెట్ గ్యారంటీ ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. అయితే పార్టీలో చేరే వారి కారణంగా ఆయా నియోజకవర్గాల్లో సమీకరణాలు మారుతాయని పార్టీ అధినాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీని కారణంగా పార్టీలో చేరే వారెవరు వారి బలమెంత ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఏ మేరకు బలహీనపడింది వంటి అనేక అంశాలపై పరిశీలన చేసిన తరువాత అభ్యర్థి ఎంపికపై అధికారిక నిర్ణయం తీసుకుంటారని వెల్లడవుతోంది. మరో వైపు ఇపుడే పార్టీ అభ్యర్థుల జాబితా ప్రకటిస్తే ఆ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించిన వారు పార్టీకి నష్టం చేకూర్చే అవకాశం కూడా ఉందని పార్టీ అధినాయకత్వం ఆందోళన చెందుతోందని వెల్లడిస్తున్నారు. అన్నింటికన్నా ముఖ్యమైన అంశం పార్టీ గతంలో తీసుకున్న నిర్ణయంపై పునసమీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడవుతోంది. ఒక కుటుంబం నుంచి ఒకరికే టికెట్ ఇవ్వాలన్న పార్టీ నిర్ణయంపై పార్టీలోని సీనియర్ నాయకులు అధినేత చంద్రబాబు వద్ద ప్రస్తావించి నిర్ణయం మార్చుకోవాలని సూచించినట్లు వెల్లడవుతోంది. దీని కారణంగా పార్టీ పొలిట్ బ్యూరో సమావేశంలో మరో మార్పు చర్చించి తగిన నిర్ణయం తీసుకోవడానికి చంద్రబాబు అంగీకరించారని పార్టీ నేతల ద్వారా తెలుస్తోంది. ఇది కూడా అభ్యర్థుల ఎంపికపై జాప్యానికి కారణమని పేర్కొంటున్నారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు పోటీ చేసే వారు దాదాపు అన్ని జిల్లాల్లో ఉన్నారని పేర్కొంటున్నారు. ఒక కుటుంబానికి ఒక టికెట్ అనే సందర్భం వస్తే అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం కూడా ఉందని వారంటున్నారు. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొంటున్నారు. ఇక మిత్రపక్షమైన జనసేన పార్టీకి కేటాయించే స్థానాలపై ఒక నిర్ణయానికి వచ్చారని తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని వారంటున్నారు. మరో వైపు బిజెపి కూడా కలిసి వచ్చే అవకాశం కూడా ఉండటంతో ఆ పార్టీ నిర్ణయం కోసం కూడా కొంత కాలం వేచి చూడాల్సిన పరిస్థితి ఉందని వెల్లడవుతోంది. మొత్తం మీద టిడిపి అభ్యర్థుల జాబితా ఫిబ్రవరి మొదటి, రెండవ వారంలో విడుదలకే ఎక్కువ అవకాశం ఉందని స్పష్టమవుతోంది. ఒక వైపు అధికార వైసిపి అభ్యర్థుల జాబితా అధికారికంగా వెల్లడవుతుండగా మరో వైపు తమ అభ్యర్థిత్వంపై పార్టీ నిర్ణయం తీసుకోకపోవడంతో పార్టీలోని ఆశావాహుల్లో ఆతృత రోజురోజుకు పెరుగుతోంది.

# ప్రముఖులకు చేరిన అయోధ్య అక్షింతలు





(మొదటిపేజీ తరువాయి)

అక్షింతలను అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నందిసాయిరెడ్డి, రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేష్ , రాష్ట్ర ధర్మప్రసార ప్రముఖ్ ఏ.వీ ప్రసాద్, కర్నూలు విభాగ్ సేవ ప్రముఖ గురుమూర్తి, నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

# ఖద్దరు వైపు అడుగులు వేస్తున్న ఖాఖీటోపి..

(మొదటిపేజీ తరువాయి)

ఆలూరు నియోజకవర్గానికి రాష్ట్రంలో ఎక్కడ లేనంత పోటీ ప్రధాన పార్టీలలో నెలకొంది. తెలుగుదేశం పార్టీ తరుపున గతంలో నాలుగు కుటుంబాలు పోటీ ఉండేవి. అయితే ఇటీవల ఒకరు వైసిపి గూటికి చేరడంతో సంఖ్య తగ్గిపోయింది. గతంలో వైసిపి తరుపున తానొక్కడినే అభ్యర్థి మా పార్టీ నుండి టికెట్ అడిగే దమ్ము ఎవరికి ఉందని మీసం మెలేసిన మంత్రి ఇప్పుడు తన టికెట్ తనకే దక్కే స్థితిలో లేనందున అందునా వైసిపి నుండి దాదాపు డజను మందికి పైగా ఆశావాహులు బరిలో నిలుస్తున్నారు. అందులో భాగంగా ఆలూరు నియోజకవర్గం నుండి ఇదివరకే చిప్పగిరి జడ్పిటిసి విరుపాక్షి మంత్రికి పోటీగా తనకు టికెట్ ఇవ్వాలని జగనన్న దృష్టికి వెళ్లారు. అలాగే కప్పట్రాళ్ల బొజ్జమ్మ కూడా తనకు సిఎం జగనన్న హామీ ఇచ్చినట్లు తెలుపుతుంది. అలాగే మాజీ ఎంఎల్ఏ దివంగత నీరజారెడ్డి కూతురు హిమవర్షరెడ్డి కూడా టికెట్ రేసులో ఉంది. వీరి తర్వాత ఇదే వరుసలో వైసిపి నుండి జడ్పిటిసిలు, మండల కన్వీనర్లు, ఎంపిపిలు మంత్రికి లేకుంటే తమకు టికెట్ ఇవ్వండి అని తమ గళాన్ని అధిష్టాణం ముందు వెల్లబుచ్చుతున్నారు. వారిలోచిప్పగిరి ఎంపిపి జూటరు హేమలత, మారయ్య, గుమ్మనూరు నారాయణ, ఆలూరు జడ్పిటిసి ఏరూరు శేఖర్, తెర్నేకల్ సురేంద్రెడ్డి, మధుసూధన్‌రెడ్డిలు ఉన్నారు. అయితే అందుకు భిన్నంగా జిల్లాలో వాల్మికుల తర్వాత అధిక జానాభాఉన్న తమ వర్గానికి టికెట్ ఇవ్వాలని బళ్లారి మాజీడిప్యూటిమేయర్ మొలగవల్లి శశికళ కృష్ణమోహన్, ఒక పోలీసు అధికారి కోరుతున్నారు.

**ఖద్దరు వైపు ఖాఖీ చూపు..**

ఆలూరు సర్కిల్ నుండి గతంలో విధులు నిర్వహించిన ఒక పోలీసు అధికారి ఇప్పుడు కడపలో పనిచేస్తున్నట్లు సమాచారం. అక్కడ ఉన్న నాయకులతో సమావేశం అయి తాను పనిచేసిన ఆలూరు, ఆదోని, కర్నూలు పార్లమెంటు స్థానాలలో ఏది ఇచ్చినా బరిలో నిలవడానికి సిద్ధమని గతంలో జిల్లా పలు నియోజకవర్గాలలో పనిచేశానని అన్ని పార్టీల రెండో స్థాయి లీడర్లతో సత్సంభందాలు ఉన్నాయని ఇరు ప్రధాన పార్టీలలో ఏ పార్టీ టికెట్ ఇచ్చినా తాను పోటీకి సిద్ధమని తెలిపారు. అందునా జిల్లాలో రెండో అతిపెద్ద సామాజికవర్గానికి చెందిన తనకు టికెట్ ఇస్తే బిసిలకు సంపూర్తిగా న్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. అనంతపురంజిల్లాలో ఇచ్చినట్లు ఇక్కడ కూడా బిసిలకు రెండు ఎంఎల్ఏ సీట్లు ఇవ్వాలని వారు తెలిపారు. ఇప్పటికే సిఎం సలహాదారులతో టచ్‌లో ఉన్నానని తెలిపారు. పార్టీలకు అతీతంగా గతంలో జిల్లాలో అందరి నాయకులతో సంభంధాలు మెరుగ్గా ఉన్నాయని ఇరు ప్రధాన పార్టీల అధినేతలు ఆలోచించి అందరివాడుగా ఉన్న తనకు అవకాశం ఇవ్వాలని వారు ఇరు పార్టీల అధినేతలను కోరారు. అలాగే దేవదేవుడు పరమేశ్వరుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని తనకు ఈశ్వరుడి దయవల్ల అవకాశం కల్పిస్తే కర్నూలు, అనంతపురం రెండు జిల్లాలో ఉన్న తన వర్గాన్ని తనకు అవకాశం కల్పించిన పార్టీకి మద్దతు తెలుపుతామని అన్నారు. ఏదిఏమైనా ఆలూరు నియోజవర్గం అసెంబ్లీ టికెట్ ఆర్టీసి బస్ టికెట్‌తో సమానమైపోయిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# మార్గదర్శకాల ప్రకారం ఓటర్ల జాబితా సవరణ: జిల్లా కలెక్టర్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** కేంద్ర ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాలను అనుసరించే ఓటర్ల జాబితా సవరణ జరుగుతోందని జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే నిర్దేశించిన ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. వచ్చిన ప్రతిఫారంను ఎన్నికల కమిషరన్ నియమ నిబంధనల ప్రకారం డిస్పోస్ చేస్తామన్నారు. పోలింగ్‌స్టేషన్‌కు సంబంధించి ఏమైనా సమస్యలుంటే సంబంధిత ఈఆర్‌వోకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో మధుసూధన్‌రావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ మురళి, టీడీపీ తరపున ఎల్‌వి.ప్రసాద్, వైసీపీ తరపున కర్నాటిపుల్లారెడ్డి, ఏజాజ్‌అలీఖాన్, బీజేపీ తరపున సాయిప్రదీప్, బీఎస్పీ తరపున అరుణ్‌కుమార్, సాదిక్‌అలీ పాల్గొన్నారు.

# పెద్దకడుబూరు నుంచి 20 కుటుంబాలు వలస..

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** ఖరీఫ్ సీజన్ ముగియడంతోరబీసీజన్ ప్రారంభం అయింది. అయితే అయా గ్రామాలలో కూలీలకు చేతినిండా వ్యవసాయ పనులు దొరకకపోవుడంతో వ్యవసాయ కూలీలు మూటముల్లే సర్దుకోని పిల్ల పాపలను వెంట బెట్టుకొని మిరప. పత్తి కోత తీయడానికి గురువారం పెద్దకడుబూరు గ్రామం నుండి 20 కుటుంబాలు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు వెళ్లిపోతున్నామని కూలీలు తెలిపారు.



అలాగే ఇప్పటికే మండలంలోని చిన్నకడుబూరు. తారాపురం. గవిగట్టు. బాపులదొడ్డి. చిన్నతుంభళం కల్లుకుంట. రంగాపురం. పెద్దకడుబూరు. హెచ్. మురువణి. కంభళదహల్. కంభళదిన్నే తదితర గ్రామాలనుంచి వందలాది కుటుంబాలు పత్తి. మిరపకాయలు కోత కోయాడానికి వెళ్లినట్లు అయా గ్రామాల ప్రజలు అందించిన సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పించాలని పలువురు వ్యవసాయ కూలీలు కోరుతున్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**గడివేముల, మేజర్‌న్యూస్‌:** చదువుల తల్లి, భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే 193వ జయంతి వేడుకలు మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ఎం.రామేశ్వరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే మహారాష్ట్ర జిల్లాలోని ఒక చిన్న గ్రామంలో 1831వ సంవత్సరంలో జన్మించారని 9 సంవత్సరాల సావిత్రీబాయి పూలేకు 13 సంవత్సరాల మహాత్మా జ్యోతిరావు పూలేతో వివాహం జరిగిందన్నారు. వివాహం తర్వాత సావిత్రీబాయి పూలే విద్యను అభ్యసించడానికి నూతన జీవితాన్ని నిర్మించుకోవడానికి భర్త జ్యోతిరావు పూలేతో ఏకీభవించి భర్త వద్దనే చదువుకున్నారని అన్నారు. మహి ళల విద్యా వ్యాప్తి కొరకు సాంఘీక సంస్కరణల కోసం తీవ్రంగా కృషి చేశారన్నారు. 1848 సంవత్సరంలో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి స్త్రీల విద్యకై కృషిచేసిన తొలితరం మహిళ, ఉద్యమకారిణి, స్త్రీల విముక్తి కోసం అహర్నిషలు కృషిచేసిన నాయకి, కులమతాలకు అతీతంగా పురుషులతో సమానంగా స్త్రీలు విద్యావంతులు కావాలని పాఠశాలలు నడిపిన మహోన్నత వ్యక్తని, ఆడపిల్లల చదువుకోసం నిరంతరం పాటుపడిన మ హిళా చైతన్యమూర్తి, నిమ్నవర్గాల అభ్యున్నతి కోసం పోరాటాలు చేసి మహిళల అభివృద్ధికి కృషి చేశారని, వితంతువులకు శిరో ముండనం చేయవద్దని ఉద్యమం చేసి విజయం సాధించిన నాయకురాలని కొనియాడారు. పాఠశాల ఏఓ , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

# ఘనంగా గ్రామదేవతల ఉత్సవాలు


కన్నుల పండుగగా కుంభాభిషేకాలు

**కోసిగి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అగసనూరు, కందుకూరు గ్రామాల్లో వెలసిన శ్రీమారికాంభాదేవి దేవర ఉత్సవాలు రెండురోజుల పాటు కొనసాగాయి. మంగళవారం రాత్రి నుండి ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి దేవతల విగ్రహాలను గ్రామ పురవీధులుగుండా ఊరేగింపుగా తీసుకెళ్ళి భక్తిశ్రద్ధలతో దేవాలయంలో ప్రతిష్టించడం జరిగింది. బుధవారం ఉదయం ప్రతి ఇంటినుండి కుంభాభిషేకం, మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పండుగ రెండురోజుల పాటు జరగడంతో గ్రామం కళకళలాడుతుంది. కోలాటాలు, భజన కార్యక్రమాలు వంటి కార్యక్రమాలతో కిటకిటలాడుతుంది. ఈ ఉత్సవాలకు వైకాపా నాయకులు మురళీరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు లవకుశ ఈరన్న, నాడుగేని నరసింహులు, నాగరాజు, వడ్డే ఉలిగయ్య, కందుకూరు తాయన్న, ఆకాష్‌రెడ్డి, పికె భీమన్న, నాగేంద్ర, కందుకూరు వీరారెడ్డి పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న టీడీపీ ఇన్‌ఛార్జి

**కౌతాళం, మేజర్‌న్యూస్:** మండలంలోని ఉరుకుంద ఈరన్నస్వామి దేవస్థానంలో జరిగిన వివాహ వేడుకల్లో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆయన ఈరన్నస్వామి వారిని దర్శించుకుని పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనను శాలువా,పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆయన వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కలకాలంసుఖసంతోషాలతో వర్ధిల్లాలని దీవించారు. ఈ కార్యక్రమంలోమంత్రాలయం మండల కన్వీనర్ పన్నాగ వెంకటేశప్పస్వామి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్పదని, తెలుగు రైతుజిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతిరాజు, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి కొట్రేష్‌గౌడ్,యువ నాయకులు మాధవరం కృష్ణమోహన్‌రెడ్డి,బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కురుగోడు, బాపురం వెంకటరెడ్డి, ఐటీడీపీ మంజునాథ్‌దోని, నరసింహులు పాల్గొన్నారు.


నూతన వధూవరులతో టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి

# మనస్థాపంతో మహిళ ఆత్మహత్య

**కర్నూల్ క్రైమ్, మేజర్ న్యూస్ :**

భర్త వేధింపులు తాళ లేక మనస్థాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని గడ్డవీధి కమేలా ప్రాంతంలోని కబరస్థాన్‌లో నివాసం ఉంటున్న రూకియా బేగం 32 సంవత్సరాలు భర్త జుబేర్ చేష్టలు నచ్చక మనస్థాపానికి గురై మంగళవారం ఇంటో ఎవరు లేని సమయంలో ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే విషయం తెలుసుకున్న బంధువులు స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని డాక్టర్లు తెలపడంతో బంధువులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం బేగం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.జుబేరుకు రుఖియా బేగంతో 17 సంవత్సరాల క్రితం పెళ్లయిందని ఇద్దరు కొంతకాలం బాగా ఉండేవారని కొన్ని రోజులుగా గొడవ పడుతుండేవారని స్థానికులు తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారని ఆత్మహత్య గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. రుఖియా బేగం తల్లి అబిదాబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

## బైజుస్ కౌన్సిలింగ్ సెంటర్ పై ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల దాడి

**ఫర్నిచర్ ధ్వంసం.. 11 మందిపై కేసు నమోదు**

**కర్నూల్ క్రైమ్, మేజర్ న్యూస్ :** నగరంలోని చెక్‌పోస్టు వద్ద ఉన్న బైజుస్ కౌన్సిలింగ్ సెంటర్ పై బుధవారం స్థానిక ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు దాడి చేశారు. అక్రమంగా సెంటర్లోకి ప్రవేశించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, బడిపిల్లలకు టాబులు ఇచ్చే విషయములో నినాదాలు చేశారు. దాడిలో ఫర్నిచర్ ట్యాబులు ధ్వంసం కాగా అక్కడ ఉన్న సిబ్బందిపై కూడా దాడి చేశారని కౌన్సిల్ సెంటర్ అధినేత శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ సిఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

# రైలు ఢీకొని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** రైలు ఢీ కొని వెల్దుర్తి పట్టణానికి చెందిన కురువ రాముడు(52) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు సాయంత్రం 4:00 గంటల సమయంలో మధురై నుండి ఓఖా వెళ్లు సూప్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాముడిని ఢీకొందని, మృతుడికి మతిస్థిమితం సరిగ్గాలేదని, చెవులు వినపడవని, పక్షవాతం కూడా ఉందని, దీంతో రైళ్ళ పట్టాలు దాటుతున్నప్పుడు ఈ ఘటన జరిగి ఉంటాదని తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు విచారించి, కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి సిహెచ్‌సీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు దివ్యాంగులైన సంతానం ఉన్నారు.

# నమ్మించి మోసం చేశారు


మాట్లాడుతున్న మస్తాన్‌వలి

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** కేంద్రంలో నరేంద్రమోడీ, రాష్ట్రంలో వైఎస్.జగన్ ప్రజలను నమ్మించి మోసం చేశారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కార్యనిర్వహక అధ్యక్షుడు మస్తాన్‌వలి విమర్శించారు. బుధవారం కర్నలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశ, దశ ఇవ్వడానికి వచ్చామని, సీఎం జగన్‌మోహన్ పాలనలో రాష్ట్రంలో పూర్తిగా దివాలా తీసిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల మయం చేశారన్నారు. మూడు రాజధానులు అంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు బాబురావు, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, లక్ష్మినారాయణ, దామోదరం రాధాక్రిష్ణ, కరుణాకర్‌బాబు, నాగమధుయాదవ్, జాన్‌విల్సన్, నీలకంఠప్ప, క్రాంతినాయుడు, లక్ష్మినారాయణ, బతుకన్న, లాజరస్, అమరేందర్‌రెడ్డి, వీరేష్, మారుతిరావు, రియాజుద్దీన్, మహబుబ్ పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు టీకాలు వేయించండి

**అవుకుమేజర్,న్యూస్‌:** అవుకు మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగినది. ఇదే విధంగా ప్రతి గ్రామంలో పైన తెలిపిన షెడ్యూల్ ప్రకారము ప్రతి గ్రామంలో ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేసుకోవాల్సిందిగా డాక్టర్ ఐశ్వర్య మరియు డాక్టర్ భారతి దేవి తెలపడం జరిగింది. ఈ రోజు మెట్టుపల్లె గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం డాక్టర్ భారతీదేవి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. పశుగణా ఈ కార్యక్రమంలో సహాయకుడు రాజేష్ చరణ్ మరియు గోపాలమిత్ర హరినాథ్ అటెండర్ మక్బుల్ హుసేన్ పాల్గొనడం జరిగింది.

# మిరప పంట ధ్వంసం

**గడివేముల, మేజర్‌న్యూస్‌:**

మండల పరిధిలోని కరిమద్దెల గ్రామానికి చెందిన రమణయ్య చేతికి వచ్చిన మిరప పంటను బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మూడు ఎకరాలలో మిరప పంటను నాలుగు నెలల క్రితం సాగు చేశారు. మిరపకాయలు పండుమారి కోతకు వచ్చిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి పొలంలో మిరప పంటను ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు గడివేముల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.



సూర్య



# ఉద్యమనేత బొజ్జ విడుదలకు గొంతెత్తిన రైతులు

## – బొజ్జ అరెస్టుకు నిరసనగా రాస్తారోకో

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్:** రాయలసీమ కరువు, వలసల శాశ్వత పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయకుండా రాయలసీమ ప్రాంతానికి సాగు,తాగునీరు అందించి ఆదుకోవాలని పోరాడుతున్న రాయలసీమ ఉద్యమనేత బొజ్జా దశరథరామిరెడ్డిని అరెస్టు చేయడం అన్యాయమని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, రైతులు ప్రశ్నించారు. బొజ్జా దశరథరామిరెడ్డి అరెస్టుకు నిరసనగా బుధవారం నంద్యాల శ్రీనివాససెంటర్‌లో రాయలసీమ సాగునీటి సాధన సమితి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైతులు మానవహారంగా నిలిచి నిరసన తెలిపారు. ఈసందర్భంగా సమితి ఉపాధ్యక్షులు వైయన్ రెడ్డి, న్యాయవాది శంకరయ్య, వైయస్సార్‌సిపి రైతు నాయకులు బెక్కెం రామసుబ్బారెడ్డి, చిన్న తిరుపతిరెడ్డి, టీడీపీ రైతు నాయకులు బాలీశ్వర్‌రెడ్డి, రవిబాబు తదితరులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కొత్తపల్లె మండలం సంగమేశ్వరం పుణ్యక్షేత్రం సమీపంలోని సిద్దేశ్వరం గ్రామం వద్ద కృష్ణానదిపై అలుగు నిర్మిస్తే సుమారు 60టీఎంసీ నీరు నిలిచి రాయలసీమ ప్రాంతానికి సాగుతాగునీరు అందుతాయన్నారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి, రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు బొజ్జా దశరథరామిరెడ్డి నాయకత్వంలో 2016 మే 31వ తేదీన రాయలసీమ ఉమ్మడి నాలుగు జిల్లాల నుంచి సుమారు 35వేల మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం ప్రజా శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఆనాటి కేసులో ఇప్పుడు బొజ్జాను అరెస్టు చేశామని ప్రభుత్వం ఇప్పుడు చెప్పడం సరికాదన్నారు. గత ఏడాది కర్నాటక, ఇటీవల తెలంగాణా ఎన్నికల్లో రాయలసీమ లబ్ధికోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి రాయలసీమకు నీరు రాకుండా చేస్తోందని దీన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడం లేదని బొజ్జా దశరథరామిరెడ్డి రాయలసీమ వ్యాప్తంగా ఉద్యమం చేస్తున్నందున అరెస్టు చేస్తున్నారా అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కృష్ణానది యాజమాన్య బోర్డును కృష్ణానది పరివాహక ప్రాంతంలో గాక విశాఖపట్టణంలో ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని బొజ్జా వ్యతిరేకించడం, తెలంగాణాకు కృష్ణా నది జలాలు తరలించి రాయలసీమకు ఎడారిగా మార్చే కేంద్ర నల్లచట్టాన్ని రద్దు చేయాలని బొజ్జా రాజీలేని ఉద్యమం చేస్తున్నాడని రాష్ట్ర ప్రభుత్వం అసమర్థతను వామపక్ష పార్టీలో కలిసి ఉద్యమం రూపంలో నిలదీస్తున్నందుకే ప్రభుత్వం బొజ్జాపై అక్రమ కేసులు పెట్టి పాత కేసులు అంటూ అరెస్టు చేస్తుందని వారు ఆరోపించారు. అంతేకాకుండా రాయలసీమ ప్రాంత సాగునీటి హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న దశరథరామిరెడ్డిని అరెస్టు చేయడం రాయలసీమ గొంతును అణచివేయడమేనని వారు తీవ్రంగా విమర్శించారు. అరెస్టులతో రాయలసీమ ఉద్యమకారుల గొంతు నొక్కలేరని బొజ్జా దశరథరామిరెడ్డిని బేషరతుగా విడుదల చేసి కేసులు రద్దు చేయాలని, జగన్ ప్రభుత్వం, కేంద్రంపై వత్తిడి పెంచి కర్నాటకలో అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టును ఆపాలని ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి తీవ్రంగా అన్యాయం చేసే కృష్ణానది నీటి తరలింపు నల్ల చట్టాలు రద్దు చేయించాలని కర్నూలులో కెఆర్ఎంబిని ఏర్పాటు చేయాలని రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజా సంఘాల నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఉద్యమనేత అరెస్టుకు నిరసనగా రైతుల రాస్తారోకో చేస్తున్న దృశ్యం

# శాంతిరాం క్రీడాకారుల ప్రతిభ

**నంద్యాలరూరల్, మేజర్‌న్యూస్:** నెరవాడ సమీపంలోని శాంతిరాం ఇంజనీరింగ్ విద్యార్థులు ఫుట్‌బాల్ పోటీల్లో బహుమతి సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సుబ్రమణ్యం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నంద్యాల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నంద్యాల ఫెస్టివ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ సీనియర్స్‌లో నిర్వహించడం జరిగింది. ఈ టోర్నమెంట్ శాంతిరాం ఫుట్‌బాల్ క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి సెమీఫైనల్స్‌లో నందికొట్కూరు జట్టుపై 3-2 గోల్స్ విజేత అయి ఫైనల్‌లో నంద్యాల జట్టుపై 3-1 గోల్స్ తేడాతో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. ఈసందర్భంగా గెలుపొందిన క్రీడాకారులను ఎండి శివరాం అభినందించారు. ఈకార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

## సిద్దేశ్వరస్వామి దేవాలయంలో

# భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



స్వామి వారి ప్రతిమకు రుద్రాభిషేక పూజలు చేస్తున్న దృశ్యం

**హొళగుంద, మేజర్‌న్యూస్ :** హొళగుంద కొండ గుహలో వెలసిన శ్రీ సిద్దేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసంలో భాగంగా ప్రతి నిత్యా భక్తులు స్వామి వారికి భక్తిశ్రద్దలతో రుద్రాభిషేక పూజలు చేయిస్తున్నారు.నెల రోజుల పాటు జరిగే పూజా కార్యాక్రమంలో ప్రతి రోజు భక్తులు తెల్ల వారి జామున దేవాలయంలో స్వామి వారి ప్రతిమకు పూజలు చేస్తున్నారు.వేద పండితులు రేణుకారాధ్య స్వామి వేదమంత్రాలను చదవడంతో భక్తులు ఆచరిస్తు పూజలు భక్తిభావంతో చేస్తున్నారు.దేవాలయంలో స్వామి వారికి అర్చకులు ప్రత్యేకంగా పూజలు,ఆలంకరణ మహామంగళారతి పూజలు చేశారు.వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్నారు.

# ఘనంగా సావిత్రి బాయిపూలే జయంతి వేడుకలు

**హొళగుంద, మేజర్ న్యూస్ :** హొళగుంద మండలంలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వ హించారు. స్థానిక ఉషోదయ గ్రామీణ అభివృద్ది సంస్థ,దళిత సమాఖ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సంస్థ పౌండర్ ప్రిడెంట్ సిహెచ్ నాగరాజ మాట్లాడుతూ సావిత్రి బాయిపూలే 1931 జనవరి 3వ తేదిన మహారాష్ట్రలో సతారా జిల్లాలో జన్మించారని తెలిపారు.1848లో తొలి మహిళ పాఠశాలను స్థాపించడమే కాకుండా అనాధ ఆశ్రమాలు కూడా స్థాపించి తన గొప్పతనాన్ని చాటుకున్నారని అన్నారు.కార్యాక్రమంలో నల్ల మల్లేష్,బుడగ జంగాల నాయకులు రామాంజనేయులు, ముగ్గు గోవిందా, దేవేంద్ర, శివ, వీరేశ్, హుసేని, గోవిందు, మల్లయ్య పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలేకి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# రెండురోజులపాటు భూసర్వే సమస్యలపై గ్రామసభలు

## – మండల తహశీల్దార్ రవికుమార్

**బండిఆత్మకూరురూరల్, మేజర్‌న్యూస్ :** నేటి నుండి రెండు రోజులపాటు రీ సర్వే పూర్తయిన గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు బండి ఆత్మకూరు మండల తహశీల్దార్ రవికుమార్ తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు యర్ర గుంట్ల, కాకనూరు, రేపు పరమటూరు, పెద్ద దేవలాపురం గ్రామా లలో రీ సర్వే సమస్యలపై రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తారని తెలి పారు. ఈ నాలుగు గ్రామాలలో రైతులకు ఏమైనా భూ సమస్యలు, రీ సర్వే సమస్యలుంటే అర్జీల రూపంలో ఇవ్వాలని కోరారు. భూమి హెచ్చుతగ్గులున్నా ఆన్‌లైన్‌లో నమోదు ఎక్కువ, తక్కువ వున్న, భూమి స్వభావంలో తేడాలున్నా రైతులు వాటికి సంబంధించి ఆధారాలతో అర్జీలు పెట్టుకోవచ్చని సూచించారు. గ్రామ సభల కోసం తహశీల్దార్‌తో పాటు డిప్యూటి తహశీల్దార్, మండల సర్వేయర్, ఆ గ్రామ వీఆర్‌ఓతో పాటు విలేజ్ సర్వేయర్ అందుబాటులో ఉంటారని సూచించారు. ప్రజలు భూ సమ స్యలపై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రవికుమార్ కోరారు.



మాట్లాడుతున్న రవికుమార్

# సీఎం జగన్‌తోనే భవిష్యత్తుకు భరోసా

## – ఎమ్మెల్యే శ్రీదేవమ్మ

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** సీఎం వై ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర భవిష్యత్తు భరోసా అని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవ మ్మ అన్నారు. బుధవారం పగిడిరాయి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే శ్రీదేవమ్మ కు స్థానిక సర్పంచ్ బోడబండ సౌజన్యం, సర్పంచ్ సలహాదారుడు బోయడబండ హనుమంతు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు ఇలాగే శాశ్వతంగా ఉండాలంటే తిరిగి వైఎస్.జగన్‌ను సీఎంని చేసుకోవా లన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జగన్నాథరెడ్డి, పగిడిరాయి బసిరెడ్డి, ఎంపీపీ హనుమరాజు ఆదెమ్మ, జడ్పీటీసీ పులికొండ నాయక్, మండల కన్వీనర్ జిట్టా నగేష్‌యాదవ్, వైసీపీ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు పెండేకల్లు గోపాల్‌రెడ్డి, బసిరెడ్డి, రామకొండ సుధాకర్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీదేవమ్మ



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

# ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. కల్లూరు అర్బన్ పరిధిలోని లక్ష్మీపురం, షరీన్‌నగర్‌లలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు జరిపి సర్జరీ జరిగిన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చిన రోగులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# పింఛన్ల పెంపు ఒక చారిత్రాత్మకం : ఎమ్మెల్యే ఆర్థర్

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** దేశంలోని ఏ రాష్ట్రంలో చేయని విధంగా మన రాష్ట్రంలో పింఛన్లను రూ.2,750ల నుంచి రూ.3వేలకు పెంచడం ఒక చారిత్రాత్మకమని ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పింఛన్ల పెంపు వారోత్సవాలలో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్థర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రతినెలా గ్రామ వాలంటీర్ల ద్వారా అందించే పింఛన్లను విడతల వారిగా రూ.3వేల వరకు పెంచిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రైతులకు రైతు భరోసా, పంటనష్ట పరిహారం, ఆడపడుచులకు అమ్మ ఒడి, ఆసరా, చేయూత ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో వున్నప్పటికీ సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పని చేసినట్లు తెలిపారు. నిరంతరం ప్రజల కోసం పాటుపడే ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు అండగా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లోను ఆయనకు మద్దతుగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోను సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా మానిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాకుండా ఇతర హామీలను కూడా నెరవేర్చినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగిందన్నారు. అనంతరం కొత్త పింఛన్ దారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఆడుదాం ఆంధ్రలో భాగంగా క్రీడాకారులకు డ్రస్ మెటీ రియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి సుధాకర్ రెడ్డి, ఎంపిపి కుసుమలత, ఎంపీడీఓ మేరి, తహశీల్దార్ చంద్రశే ఖర్ నాయక్, ఏపీఎం పుల్లయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపల్లిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఆర్థర్

సూర్య
గురువారం 04 జనవరి 2024

# నంద్యాల నుంచి రేణిగుంట వరకు ప్యాసింజర్ రైలు



**– ఈ నెల 6 నుంచి పొడగింపు**

**కర్నూలు, సూర్యప్రతినిధి :** నంద్యాల నుంచి కడప వరకు ప్రస్తుతం ఉన్న డెమో ప్యాసింజర్ రైలును ఈ నెల 6వతేదీ నుంచి రేణిగుంట వరకు పొడిగించనున్నారు. దీంతో నంద్యాల నుంచి తిరుపతికి ప్రయాణీకులు ఉదయం సమయంలో నేరుగా వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. ఇప్పటి వరకు కడప డెమో ప్యాసింజర్ రైలుగా ఉన్న ఈ రైలును రేణిగుంట వరకు పొడిగిస్తూ కేంద్ర రైల్వే శాఖ నిర్ణయం తీసుకోగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ నెల 6వతేదీన రేణిగుంట వరకు పొడిగించిన కొత్త సర్వీసును పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. ఈ రైలు ఉదయం 5.30గంటలకు నంద్యాలలో బయలుదేరి మధ్యాహ్నం 12.30గంటలకు రేణిగుంటకు చేరుకుంటుందని, రేణిగుంట నుంచి మధ్యాహ్నం 1.30గంటలకు బయలుదేరి రాత్రి 8.30గంటలకు నంద్యాలకు వస్తుందని రైల్వే అధికారుల ద్వారా తెలుస్తోంది. కాగా తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల్లో భాగంగా రైలును ప్రస్తుతం రేణిగుంట వరకు నడుపుతారని, తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు పూర్తయిన తర్వాత తిరుపతి వరకు పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. నంద్యాల-కడప రైలు రేణిగుంట వరకు పొడిగించిన కారణంగా తిరుమలకు వెళ్లే భక్తులకు రైల్వే శాఖ కల్పించిన సదుపాయంతో ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

# మత్స్యకారులకు అన్ని పార్టీలు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

**– మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి**

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** మత్స్యకారులు ఎంతో నమ్మకమైన, చాలా తెలివైన వ్యక్తులని వారికి ఖచ్చితంగా రాజకీయంగా ప్రాధాన్యత కల్పించేలా నా వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డ అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలంయలో ఉమ్మడి కర్నూలు జిల్లా మత్స్యకారుల సహకార సంఘానికి నూతనంగా ఎన్నికైన పాలక వర్గ సభ్యుల ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఫిషర్‌మెన్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ నవీన్‌కుమార్ హాజరయ్యారు. అఖిల భారత మత్స్యకార సంఘం జాతీయ ఆర్గనైజర్ ఉండవల్లి వెంకటన్న నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని పార్టీలు కూడా మత్స్యకారులకు రాయలసీమ ప్రాంతంలో కూడా ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు పెద్దవీరేష్, డైరెక్టర్లు మల్లీశ్వరుడు, పాతకోట వెంకటేష్, భాస్కర్, పోతుల శేఖర్, భాస్కర్, నగేష్, నాగశేషు, మద్దిలేటి పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న దృశ్యం

# హిప్నోసిస్ ద్వారా ఒత్తిడి, ఆందోళన తగ్గించవచ్చు..

**నేడు ప్రపంచ హిప్నోసిస్ దినోత్సవం..డాక్టర్ శిరిగిరెడ్డి జయారెడ్డి**

**కర్నూలు,మేజర్ న్యూస్ :** మానసిక ఒత్తిడి ఆందోళన చెందే వారికి హిప్నోసిస్ ఒకవరంలాంటిదని ఆత్మహత్యలకుసిద్ధపడే వారికి సైతం చికిత్స అందించవచ్చని ప్రముఖ హిప్నాతెరపిస్ట్ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ శిరిగి రెడ్డి జయా రెడ్డి అన్నారు.జనవరి 4వ తేది గురువారం ప్రపంచ హిప్నోసిస్ దినోత్సవం సందర్భంగా ఆయన మేజర్ న్యూస్‌ప్రతినిధితోమాట్లాడారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు హిప్నోసిస్ చాలా ఉపయోగపడుతుందని ఒత్తిడి లేకుండా హిప్నోసిస్ ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంచవచ్చు అన్నారు. ప్రతి ఏడాది జనవరి 4న ప్రపంచ హిప్నోసిస్ దినోత్సవం ఘనంగా జరుపుకుంటామన్నారు. దేశంలో మానసిక సమస్యలతో విద్యార్థులు బాధపడుతున్నారని, వారి సంఖ్య భారీగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు సైకాలజిస్టులు తక్కువగా ఉండడమే కారణం అన్నారు. డబ్ల్యూ హెచ్ఓ లెక్కల ప్రకారం దేశంలో ప్రతి ఏడుగురిలో ఒకరు మానసిక సమస్యతో బాధపడుతున్నారని, ప్రతి 10 లక్షల మందికి ఏడుగురు మాత్రమే సైకాలజిస్టులు ఉన్నారన్నారు. దీంతో సైకాలజిస్ట్‌ల కొరత పెరుగుతోందన్నారు. ప్రతి కాలేజీలో సైకాలజిస్ట్ తప్పనిసరిగా ఉండాలని 2008 లో సుప్రీంకోర్టు ప్రభుత్వాలకు సూచించిందన్నారు. దేశంలోని చాలా కళాశాలలో సుప్రీంకోర్టు సూచనలను చాలా సంవత్సరాల పాటు అమలు చేయలేదన్నారు. ప్రస్తుత పరిస్థితులలో సైకాలజిస్ట్ కోర్సుకు డిమాండ్ కొత్త మేరకు పెరగడం శుభ పరిణామం అని అన్నారు.ఆన్ లైన్‌తో పాటు ఆఫ్ లైన్ లోను గ్రాడ్యుయేట్ డిప్లమా పీజీ కోర్సులు యూనివర్సిటీలు అందిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఆంధ్ర తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఈ కోర్సు ఉన్నాయన్నారు.

**ఆదిత్య విద్య నిలయంలో :** కల్లూరులోని శ్రీ ఆదిత్య విద్యా నిలయంలో గురువారం ప్రపంచ హిప్నోసిస్ దినోత్సవం కార్యక్రమం జరుగుతోందని ప్రముఖ హిప్నో తెరపిస్టు కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ శిరిగిరెడ్డి జయారెడ్డి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ వాసుదేవయ్య అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా పాల్గొంటారని ఆయన వివరించారు.



# అయ్యో పాపం చిన్నారులు..

**- తాళం వేసిన అంగన్వాడీ కేంద్రం ముందు అన్నం కోసం..**

**- ఖాళీ ప్లేట్లతో అరుగు పై కుర్చున్న చిన్నారులు**

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** అయ్యో పాపం పసిపిల్లలు గతంలో సరదాగా అడుకొని చదువుకొని అన్నం తిన్న కేంద్రం అది. ఈ రోజు కూడా ప్రతి రోజు మాదిరే అన్నం పెడతారని చిన్నారులు ప్లేట్లు, గ్లాసులు తీసుకువచ్చి అంగన్వాడీ కేంద్రం ముందు కుర్చున్నారు. అయితే ఆ అంగన్వాడీ కేంద్రంకు తాళం వేసి ఉంది. అది తెలుసుకోలేని చిన్నారులు మధ్యాహ్నం వరకు వేచిచూసి కడుపు మాడ్చుకొని ఇండ్లకు వెళ్లిన సంఘటన హెచ్ కైరవాడి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం -3 లో బుధవారం చోటు చేసుకుంది. హెచ్ కైరవాడి గ్రామంలోని బీసీ కాలనీలో అంగన్వాడీ కేంద్రం- 3 ఉంది. అయితే గత 23 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. దీంతో కేంద్ర నిర్వహణ బాధ్యతలను సచివాలయ సిబ్బందికి అధికారులు అప్పజెప్పారు. అయితే బుధవారం ప్రతి రోజు మాదిరి దాదాపు 20 మంది చిన్నారులు ప్లేట్లు, గ్లాసులు తీసుకొని అంగన్వాడీ కేంద్రంకు వచ్చారు. అయితే అక్కడ సచివాలయ సిబ్బంది ఎవ్వరు లేక పోవడంతో కేంద్రంకు తాళం వేసి ఉంది. ఎవరు లేరన్న విషయం తెలియని చిన్నారులు మాత్రం వారి కోసం అరుగు పై ఎదురు చూస్తు రోజు లాగే భోజనం పెడతారని ఎదురు చూసుకుంటూ కుర్చున్నారు. మధ్యాహ్నం అయినప్పటికి భోజనం రాక పోవడంతో అంగన్‌వాడీ వద్దకు ఎవరు రావపోవడంతో ఎదురు చూసి చిన్నారులు ఖాళీ కడుపుతో కడుపు చేతపట్టుకొని వెనుతిరిగారు.




హెచ్ కైరవాడి అంగన్వాడి కేంద్రం ముందు ఖాళీ ప్లేట్లతో కుర్చున్న చిన్నారులు

# తెలుగుదేశంతోనే యువతకు భవిష్యత్తు: టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** తెలుగుదేశం పార్టీలోనే యువతకు భవిష్యత్తు ఉంటుందని కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ న్నారు. హెచ్‌డీఆర్ టీం శివ ఆధ్వర్యంలో దండిగేరి రాజశేఖర్, జోహరాపురం మధుయాదవ్ బృందాలు టీడీపీలో చేరారు. యువతకు టీజీ భరత్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం టీజీ భరత్‌మాట్లాడుతూ ఇన్ని రోజులు పాలన ఎలా ఉందో అందరూ చూశారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వసేత అందరికీ సంక్షేమ పథఖాలు అందించడంతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. తనను గెలిపిస్తే యువత కోసం కంపెనీలు తీసుకవస్తానన్నారు.టీడీపీ నాయకురాలు విజయలక్ష్మి, హెచ్‌డీఆర్ టీఎం సభ్యులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన యువత

# పార్లమెంటు అభ్యర్థిత్వం మార్పు ఉంటే..

**నంద్యాల నుంచి పోటీకి 'మైనార్టీలు సై'**

**– రేసులో మరో ఇద్దరు మైనార్టీ నేతలు**

**– ఒకరు ఖాదర్‌బాషా–మరొకరు షేక్ బాబులాల్**

**– అధిష్టానం ఆదేశిస్తూ పోటీకి సిద్ధం**

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో:** అధికార వైఎస్సార్‌సీపీలో పార్లమెంటు,అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థిత్వాల మార్పు ప్రకంపనలు సృష్టిస్తుంది. వైసీపీ అధిష్టానం తాజాగా రెండవ జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు నియోజకవర్గంలో అభ్యర్థిత్వాన్ని మార్చింది. ప్రస్తుతం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్థానంలో ఆయన అనుచరుడు మాచాని వెంకటేష్‌కి బిసి కోటాలో అవకాశం కల్పించింది. మూడవ జాబితాలో ఉమ్మడి కర్నూ లు జిల్లాలోని పలు నియోజకవర్గాలు ఉండే అవకాశాలు కల్పిస్తున్నాయి. నంద్యాల జిల్లాలో అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థి త్వాల మార్పు ఉండకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. కాకపోతే ఒకటి రెండు స్థానాల్లో తనయులకు అవ కాశం కల్పించవచ్చనన అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. నంద్యాల పార్లమెంటు అభ్యర్థిత్వ మార్పు సంకేతాలు కొట్టిపారేయలేకపోతున్నారు. పార్లమెంటు పరిధిలో సుమా రు మూడున్నర లక్షల జనాభా కలిగిన మైనార్టీ ప్రతిపాదన అంశాన్ని వైసీపీ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అధిష్టానం ఇద్దరు స్థానికేతరులు మరో ఇద్దరు స్థానిక నేతల్లో గెలుపుపై సర్వే నివేదికల పరిశీలనలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. తాజాగా మరో ఇద్దరు మైనార్టీ నేతలు అభ్యర్థిత్వం మార్పు ఉంటే పోటీకి సై అంటున్నారు. అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధమన్న సంకేతాలను అధిష్టాన ం పెద్దల దృష్టికి తీసుకొని వెళ్లే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకరు నంద్యాల పార్ల మెంటు పరిధిలోని నంద్యాల జిల్లా జెసి ఎస్ కో ఆర్డినేటర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మరొకరు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు, వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మెన్ ఖాదర్‌బాషలు అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధమన్న ప్రతిపాదనలు అధిష్టానం ముందు ఉంచే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. మైనార్టీల ఓటు బ్యాంకును వైఎస్సార్‌సీపీ వైపుకు పూర్తి స్థాయిలో తిప్పుకోవడంలో భాగంగానే వైసీపీ అధిష్టానం మైనార్టీ అభ్య ర్థిత్వ ప్రతిపాదన పరిశీలిస్తున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది..

అధికార, ప్రతిపక్షాలు సామాజిక సమీకరణాలకు పెద్ద పీఠ వేస్తున్నాయి. రానున్న సార్వత్రిక ఎన్నికలు ఇరు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ప్రతి ఓటు బ్యాంకును తమ పార్టీ వైపు తిప్పుకొనేందుకు ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నాయి. రాయలసీమలో అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన మైనార్టీలకు ఒక స్థానాన్ని కేటాయించాలని వైసీపీ అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సీమలో మూడున్నర లక్షల ఓట్లు కలిగిన నంద్యాల పార్లమెంటులో అభ్యర్థిత్వం మార్పు అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అధిష్టానం వద్ద ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి అంజా ద్‌బాష, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ ఛైర్మెన్ డా.నౌమాన్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు హబిబుల్లా నలుగురు పేర్లు ప్రముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా మరో ఇద్దరు తమకు అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని కోరనున్నట్లు తెలుస్తోంది. బాబులాల్ దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయం నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. 2014 నుంచి 2016 రెండేళ్ల స్థానిక రాజకీయాలతో గంగుల కుటుంబంతో పాటు తెలుగుపార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం తరువాత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపుతో గంగుల కుటుంబంతో పాటు వైసీపీలో చేరి పార్టీలో కొనసాగుతున్నారు. వైసీపీ అధిష్టానం రాష్ట్ర పదవిని ఇచ్చి సముచిత స్థానం కల్పించింది. ఇక పోతే వైసీపీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాష నంద్యాల నుంచి అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. నంద్యాల ఉప ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మైనార్టీలు అత్యధికంగా ఉన్న నంద్యాల పార్లమెంటు నుంచి అవకాశం కల్పిస్తానని ఖాదర్ బాషకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఖాదర్‌బాషను అధిష్టానం ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు ఛైర్మెన్‌ను చేసింది. తక్కువ కాలపరిమితిలో ఆయన పని చేశారు. పదవికాలం ముగిసిన తరువాత వైసిపి ప్యానెల్ ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే ఎన్నికలపై ఒకరు కోర్టును ఆశ్రయించడంతో వక్ఫ్ బోర్డు కమిటీ ఏర్పాటుకు బ్రేక్ పడింది. చిత్తూరు జిల్లా వాస్తవ్యుడైన ఖాదర్‌బాషా నంద్యాల ఉప ఎన్నికల తరువాత నంద్యాలతో పాటు పలు మండలాల్లో సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. వక్ఫ్ బోర్డు ఛైర్మెన్‌గా ఉన్నప్పుడు నంద్యాల జిల్లాలో పలు మసీదులకు స్వంత నిధులను ఇచ్చినట్లు తెలుస్తోంది. గతంలో పుంగనూరు నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ తరుపున ఇప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పోటీ చేసిన అనుభవాన్ని ఆయన వర్గీయులు ప్రస్తావిస్తున్నారు. మైనార్టీ అంశం అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలియడంతో ఆశావాహులు ఒక్కక్కరు బయటకు వస్తున్నారు. అధిష్టానం అవకాశం కల్పిస్తే రేసులో ఉన్న మైనార్టీ నేతలు డా.నౌమాన్, ఖాదర్‌బాషా, హబిబుల్లా, బాబులాల్‌లు పోటీకి సిద్ధమన్న సంకేతాలను అధిష్టానం ముందు ఉంచే ప్రయత్నాలను పదును పెడుతున్నారు. ప్రస్తుతం నంద్యాల పార్లమెంటు సభ్యుడుగా పోచా బ్రహ్మనందరెడ్డి ఉన్నారు. మరి రానున్న ఎన్నికల్లో ఆయనకు రెండవసారి అవకాశం కల్పిస్తారా! కొత్త అభ్యర్థిత్వాన్ని తెరపైకి తీసుకొని వస్తారా! అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన మైనార్టీలకు అవకాశం కల్పిస్తారా! అన్నది వేచి చూడాలి.



నంద్యాల జిల్లా జెసిఎస్ కో ఆర్డినేటర్ షేక్ బాబులాల్



వక్ఫ్ బోర్డు మాజీ ఛైర్మెన్ ఖాదర్‌బాష